# జాలిలేదా నామీద

## —పోట్లూరు సుబ్రహ్మణ్యం

**వాసుదేవరావు** ఒక సీనియర్ ఆఫీసరు. ఉద్యోగస్థుల చేత వెట్టి చాకిరీ చేయించడమంటే అతనికి మహదానందం. అతనొక నిరంకుశుడు. ఒక చిన్న తప్పుకు పడాల్సిన శిక్షకు వంద రెట్లు ఎక్కువగా శిక్ష విధిస్తాడు. స్టాఫును తిట్టడంలోకూడా ఒక ప్రత్యేక బాణీని అవలంబిస్తాడు.

వాసుదేవరావు బెల్లు కొట్టాడు.

"అయ్యా" అంటూ వచ్చి నిలబడ్డాడు ప్యూను.

"వెళ్ళి 'బి' క్లర్కు నారాయణని పిలువు."

"చిత్తం."

కొద్ది సేపట్లో నారాయణ ఆఫీసరుగారికి ఎదురుగా నిలబడి నమస్కారం చేశాడు.

ఆఫీసరుగారు నారాయణ నమస్కారాన్ని అందుకోనట్లుగా చూసి, "ఏమయ్యా-నేను బాబూరావుని రమ్మంటే నువ్వు వచ్చావా? అఁ...సరే, అనంతవరం గ్రామంనుంచి కొంతమంది ఇండ్ల స్థలాలకు పెట్టుకున్న అర్జీ మీద రిపోర్టు వ్రాశావా?" అని అడిగారు.

"లేదు, సార్."

"అర్జీ వచ్చి ఎన్ని రోజులయింది?"

"వారమయింది, సార్।"

"వారమయితే ఇప్పటివరకూ రిపోర్టు పోలేదా?"

"వైమేడి. సార్! నాలుగు రోజులు ఎలక్షను వర్కు రెండు రోజులు నన్ను రెవ్యూటేషను మీద హెడ్ ఆఫీసుకు పంపారు. నిన్న ఇంట్లో వాళ్ళకు బాగు లేకపోతే ఆదివారం కదా అని ఇంటి దగ్గరే ఉండిపోయాను."

"ఇంత వయసొచ్చింది-బుద్ధుందటయ్యా నీకు? ఇంకో రెండేళ్ళలో రిటైరుకూడా కాబోతున్నవు. ఇప్పటికీ కుంటిసాకులు పోలేదు. కొత్తవాళ్ళు ఏం నేర్చుకుంటారయ్యా మిమ్మల్ని చూసి? ఈ రోజు ఎంత పొద్దు పోయినా సరే, నాకు రిపోర్టు రాకపోతే మాత్రం నీకు మెమో ఇస్తాను-మైండిట్!"

"చిత్తం."

"వెళ్ళి 'డి' క్లర్కు బాబూరావుని పంపించు."

నెమ్మదిగా అడుగుల చప్పుడు దూరమైతే, మెత్తని అడుగుల చప్పుడు లోపలికి ప్రవేశించింది.

"నమస్కారం, సార్. నేను బాబూరావుని" భయం భయంగా అన్నాడు బాబూరావు. ఎంత తొందరగా వీలయితే అంత తొందరగా బయటపడాలనేది అతని ఉద్దేశం.

"అరె! ఎవరూ వచ్చింది? బాబూరావా? నేను రమ్మన్నది 'కె' గుమస్తా రామనాథాన్ని గదయ్యా!"

"చిత్తం, సార్."

"చిత్తం, చిత్తం అని నక్క వినయాలు పలుకుతున్నావు గాని, ఆర్. సి. నంబరు డెబ్బై ఎనభై అయిదు ఫైలుకు కొర్రీ వేసి పదిహేను రోజులయింది. దానికి రిప్లై సి రాసి పంపడం తెలియదా? సినిమాలకు, షికార్లకు వెళ్ళడంలో ఉండే ప్రాంప్ట్‌నెస్ మీకు పనిలో ఉండదయ్యా."

"సార్...నేను..."

"మిస్టర్! నువ్వేక మాట్లాడకు! ఇష్టముంటే ఆఫీసులో పని చేయి. లేకపోతే ఉద్యోగానికి రిజైన్ చెయ్యి. వర్కు విషయంలో నే నిలాంటివి టాలరేట్ చేయను. అండర్‌స్టాండ్?"

"అలాగే, సార్..." దిక్కులు చూడసాగాడు బాబూరావు.




“కనుక ఆ ఫైలుమీద రివ్యయిజ్‌డ్ రాసి గంటలోగా నా టేబులు మీదికి పంపాలి. లేకపోతే నే నొప్పుకోను.”

“అలాగే పంపిస్తాను, సార్.” ఏడుపు రాలేదు కాని, కళ్ళలోంచి నీళ్ళు మాత్రం వచ్చాయి.

తను ఓ గంట పర్మిషను పెట్టి, ఇంటికి వెళ్ళి అనారోగ్యంగా ఉన్న భార్యను చూడాలనుకున్నాడు. కాని, ఇప్పుడు పర్మిషను కాదుగదా, ఆఫీసరు చెప్పిన పని చేయకపోతే తనకు పనిష్మెంటు తప్పదని అనుకొన్నాడు.

“ఆ...వెళ్ళి 'కె' గుమాస్తా రామనాథాన్ని పంపించు.”



“ఎస్, సార్” అంటూ బోనులోంచి బయటపడ్డ పులిలా నిశ్శబ్దంగా రెండంగల్లో గది దాటాడు.

అందరి అనుభవాలూ మననం చేసుకుంటూ భయం భయంగా లోపలికి అడుగు పెట్టాడు రామనాథం. అయ్యగారు ఏం అడుగుతారో, ఏం చెప్పాలో అర్థం కాకుండా ఉంది. ఆ భయంలో ఆఫీసర్ని విష్ చేయాలన్న ఇంగితంకూడా మరిచిపోయాడు.

ముందే అతణ్ణి దులపాలనుకొన్న ఆఫీసరుకు అతను తనను విష్‌కూడా చేయకపోయేసరికి కోపం అంతకు రెండింతలైంది.

ఆకలి బయట పెట్టుకోలేక ఉగ్రంగా ఉన్న పులిలా గుర్రుమన్నాడు ఆఫీసరు.

“సార్...తమరు...”

“ఎందుకు పిలిచావని నన్నే ప్రశ్నిస్తున్నావా?” ఎగిరిపడ్డాడు ఆఫీసరు.

“నీకు బొత్తిగా మేనర్సు తెలియవయ్యా! ఎక్కడో అడవి మనిషివి పట్టుకొచ్చి మా ఆఫీసులో వేశారు. నేను చెప్పిన పని ఏమయింది? మినిస్టరుకు ఇన స్పెక్షను బంగళా రిజర్వు అయిందా?”

“దాన్ని ఎమ్.ఎల్.ఏ.రిజర్వు చేసుకున్నాడట, సార్.”

“ఆ విషయం ఇప్పుడు చెబుతున్నావు. అదీ నే నడిగితే...”

“అది కాదు, సార్।”

“ఏది కాదు? డోన్ట్ టాక్ ఎనీమోర్. నా కవన్నీ తెలియదు. మినిస్టరుకు ఇన స్పెక్షను బంగళా రిజర్వు కావాలి. లేదంటే నీ ఉద్యోగానికే ప్రమాదం-ఇక నీ ఇష్టం. ఇక వెళ్ళు. వెళ్ళి ఆ చిదంబరాన్ని పిలువు.”

ఇలా ఆ రోజు ఆఫీసరు వాసుదేవరావు ఆఫీసులో స్టాపును ఒకరికి బదులు ఒకరిని పిలిచి బాగా చీవాట్లు పెట్టాడు. ఇది అతనికి రోజూ మామూలే. రాత్రి తొమ్మిదయింది. తొమ్మిదయినా ఆ ఆఫీసులో రాత్రే పగలుగా ఉంది.

అందరూ తిట్టుకుంటూ, నసుక్కుంటూ సీట్ల ముందు కూలబడి ఉన్నారు. ఎవరికీ పని చెయ్యాలని లేదు. కాని, చండశాసనుడైన ఆఫీసరు కదిలేతవరకూ కనీసం పని చేస్తున్నట్లు నటించి అయినా సీట్ల ముందు తగులబడాలి. కాకాలకు లొంగే రకంకూడా కాదు ఈ ఆఫీసరు.

'అయ్యా, ప్రభుత్వం వారు ఉదయం పదిన్నర నుంచి సాయంత్రం అయిదు గంటలవరకే కదా పని చేయమన్నది? అలాంటప్పుడు రాత్రి తొమ్మిది గంటలవరకు ఎందుకు పని చేయాలి?' అని అనచ్చు. కాని, అతను ఆఫీసరు. వీళ్ళు గుమాస్తాలు. ఇంతకు ముందు గుమాస్తాలు ఏవో ఆ సాకు పెట్టి, ఈ సాకు పెట్టి వాళ్ళెప్పుడో డిసిప్లినరీ ఏక్షను తీసుకున్నాడు. అందుకే అందరికీ భయం.

ఆఖరుసారిగా మేనేజరు నరసింహారావుకి పిలుపు వచ్చింది. అందరి ఏడుపులూ, పెదవిప్పలూ విని, అంతవరకు వాళ్ళను ఓదార్చిన నరసింహారావుకి ఇప్పుడు తన వంతు వచ్చేసరికి భయం పుట్టింది. అయన్ని ఎలా ఎదుర్కోవాలా అని రిహార్సల్సు వేసుకోసాగాడు.

ప్రతి రోజూ ఆఫీసరు వెళ్ళే ముందు తనని పిలుస్తాడు. తనకు ఆఖరి అక్షింతలు వేసి వెళ్ళిపోతాడు. అప్పటికి ఆ గండం గడిచిపోతుంది.

నిరాశగా ఆఫీసరు రూము వైపు కదిలాడు నరసింహారావు.

మేనేజరును కూర్చోమన్నట్లు సైగ చేశాడు ఆఫీసరు.

ఆఫీసులో తన తరవాత తనంతటి వాడు మేనేజరు. తను కర్రపెత్తనం చెలాయిస్తే నిజానికి గుమాస్తాల చేత పని చేయించేది మేనేజరు. అలాంటిది అతణ్ణి పగ చేసుకుంటే ఒక్క కాగితానికీ జవాబు పై ఆఫీసర్లకు పోదు. దానితో తన ఇనెఫిషియన్సీ బయట పడుతుంది అనేది ఆఫీసరు భావన.

అందుకే మేనేజరును కొద్దిగా గౌరవిస్తాడు.

మేనేజరు కూర్చోగానే మెత్తగా చీవాట్లు పెట్టడం మొదలుపెట్టాడు ఆఫీసరు.

“మీరూ, నేనూ పనిచేస్తే సరిపోదండీ, మేనేజరుగారూ! ఈ ఆఫీసు పరిస్థితి చూడండి. ఒక్క గుమాస్తా మాట వినడం లేదు. ఒక్కొక్కడిది ఒక్కో దారి. ఏదో ఒక సాకు చెబుతూనే ఉంటారు. పని మాత్రం చేయరు” అంటూ గుమాస్తాలను పేరు పేరునా వరుస పెట్టి తిట్టి పోశాడు.

మేనేజరు ఓపికగా ఆఫీసరుకు ఒక్కొక్కరి పరిస్థితి వివరంగా చెప్పాడు. వాళ్ళ సాధక బాధకాలు వివరించాడు. కష్టపడితే వాళ్ళకు దానికి తగ్గ విశ్రాంతికూడా అవసరం అనేది అతని వాదన.

చిరాగ్గా అడిగాడు ఆఫీసరు: “ఏమ్, గుమాస్తా రామనాథం ఈ రోజు ఆఫీసుకు రాలేదా?”

“వచ్చాడు, సార్. ఆరు దాకా ఉండి వెళ్ళిపోయాడు.”

“అంటే అతని పద్ధతేనా—”

“కాదండీ, సార్. అతను పది రోజులు సెలవు కావాలని అప్లికేషను పెట్టి వారం రోజులయింది. సెలవు శాంక్షను చేయండి, సార్. రిలీవయిపోతాడు.”

“ఎందుకండీ అతణ్ణి వెనకేసుకొని వస్తారు? అతని సీట్లో పని ఎవరు చేస్తారు?”

“నేను అతణ్ణి వెనకేసుకొని రావడానికి కారణం అతని కుటుంబ పరిస్థితి, సార్. భార్యా పిల్లలు అక్కడెక్కడో ఊళ్ళో ఉన్నారు. ఇతనొక్కడే ఇక్కడ నానా తంటాలూ పడుతున్నాడు. అతని సీటుకు 'కె' గుమాస్తాను ఇన్-ఛార్జిగా పెడదాం, సార్. అతనయితే చేయగలడు.”

ఆఫీసరు కొద్ది సేపు మౌనంగా ఉండి, “అతని సీట్లో దాదాపు వంద ఫైళ్ళు పెండింగు ఉన్నాయి. వాటన్నిటికి రివ్యయిజ్‌డ్ రాసి పెట్టమనండి. తరువాత చూద్దాం” అన్నాడు.

“ఇది హెల్త్‌కు సంబంధించిన విషయం, సార్. దీనికీ దానికీ పొంతన పెట్టడం ఏం బాగా లేదు.”

“మేనేజరుగారూ! ఈ విషయంలో మీరు కలుగజేసుకోకండి. అతని చేత నేను పని చేయించలేనప్పుడు నేను ఆఫీసర్నే కాదు, అతను గుమాస్తాయే కాదు. ఇక మీరు వెళ్ళవచ్చు.”

మేనేజరు తల వంచుకొని బయటికి వచ్చేశాడు. రామబ్రహ్మం చాలా సిన్సియర్ వర్కరు. పనే దైవమని భావించేవాడు. ఎంతో జబ్బు ముదిరితేగాని సెలవు పెట్టడు. జాండిస్ చాలా ప్రమాదకరమైన వ్యాధి. దానికి అవసరమైంది తగినంత విశ్రాంతి. ఆ విశ్రాంతే ఇవ్వడం లేదు సదరు ఆఫీసరు. అప్పటికీ ఉదయం ఎనిమిది గంటలకొస్తే సాయంత్రం ఆరు గంటలవరకు పని చేస్తూనే ఉన్నాడు. అయినా, పని తరగడం లేదు. ఈ పరిస్థితుల్లో అతను ఇంకా ఎక్కువ శ్రమ పడటం ఆరోగ్యానికి ఎంతో భంగకరం. అందుకే మేనేజరు రామబ్రహ్మం సెలవుకోసం అంత సేపు బ్రతిమాలాడు.

మరునటి రోజు ఆఫీసరు సీట్లో కూర్చోగానే మొదట రామబ్రహ్మాన్ని పిలిచాడు. రామబ్రహ్మాన్ని ఎన్ని మాట లనాలో అన్ని మాటలూ అన్నాడు. అతను పెట్టిన సెలవు తిరిగి విత్‌డ్రా చేసుకోవాలన్నంతగా అతణ్ణి మాటలతో బాధ పెట్టాడు. దాంతో రామబ్రహ్మానికి తల తిరిగిపోయింది.

చివరగా దయ తలుస్తున్నట్లు "మిస్టర్ రామబ్రహ్మం! నీ సీట్లో ఉన్న వర్కు క్లియరాఫ్ చేసి నాకొచ్చి కనపడు. అప్పుడు నీకు సెలవు శాంక్షను చేస్తాను. డే అండ్ నైట్ చేస్తే అదెంత పనోయ్" అన్నాడు ధైర్యం చెబుతూ.

"సరే, సార్" అంటూ బయట పడ్డాడు రామబ్రహ్మం. తనను ఇంత సేపూ ఆఫీసరు తిట్టినందుకు రామబ్రహ్మం బాధపడలేదు. ఆఫీసరుగారు చివరగా తన కిచ్చిన సలహాకు ఎంతో ఆనందించాడు.

ఆ రోజు నుంచి రాత్రి, పగలు పనిచేయడం మొదలెట్టాడు. ఎంత వర్కు చేసినా పేపర్లు కొత్తవి వస్తూనే ఉన్నాయి. ఏమీ తరగడం లేదు. మూడు రోజుల తరువాత అతని భార్య ఆ ఊరికి వచ్చింది. రాత్రి పదయినా భర్త రూముకు రాలేదు. ఎప్పుడో అర్ధరాత్రి వచ్చాడు.

అప్పుడు అతణ్ణి చూసిన ఆమె మనసు కరిగి నీరయింది. ఏనుగులా నున్నగా, ఆరోగ్యంగా ఉండే మనిషి ఎలుకలా సన్నగా అయిపోయాడు. ఆ స్థితిలో ఆమెకు దుఃఖం ఆగింది కాదు.

"ఏమిటీ పరిస్థితి? ఎందు కిలా అయిపోయారు?" అంది ఎంతో బాధగా.

"జాండిస్ అటాక్ అయింది."

"ఎప్పట్నుంచి?"

"పది రోజులనుంచి."

"పది రోజుల క్రితం జాండిస్ అటాక్ అయితే సెలవు పెట్టి ఇంటికి రావడం తెలియదూ?"

"ఫరవాలేదులేవే. ఇక్కడే డాక్టరు దగ్గర వైద్యం చేయించుకొంటున్నాను."

"మందులకంటే ముందు విశ్రాంతి అవసరమని డాక్టరు చెప్పలేదా మీకు?"

"చెప్పాడు."

"అయితే, ఎక్కడ తీసుకుంటున్నారు విశ్రాంతి?"

"ఆఫీసులో పని ఎక్కువగా ఉంది. అందుకని..." నసిగాడు.

"అందుకని విశ్రాంతి తీసుకోలే దంటున్నారు. ఏం ఆఫీసండీ అది? ఆఫీసరుకు దయ, కరుణ, జాలి అనేవి లేవా? అంత దుర్మార్గుడా? ఆయన సెలవివ్వకపోతేమాత్రం కాగితం అక్కడ పడేసి రాకూడదూ? ఆరోగ్యం కంటేనా?"

ఆమె రామబ్రహ్మం నిర్లక్ష్యాన్ని దులిపేసింది. అంతటితో ఆగక మరునటి రోజు ఉదయాన్నే భర్తను సీనియర్ డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళింది. రామబ్రహ్మాన్ని పరీక్షించిన డాక్టరు జాండిస్ బాగా ముదిరిపోయిందని, మంచి వైద్యం, విశ్రాంతి అవసరమని చెప్పాడు. దాంతో ఉగ్రురాలయిన రామబ్రహ్మం భార్య భర్తచేత నాలుగు రోజులు సెలవు గిలికించి తనే తీసుకువెళ్ళి నేరుగా ఆఫీసరుకు ఇచ్చింది.

రామబ్రహ్మం భార్యకు పెద్దగా చదువు లేకపోయినా ధైర్యసాహసాలు, తెలివితేటలు ఉన్నాయి. అందుకనే ఆమె ఉగ్రరూపం చూసి ఆఫీసరు ఏమీ మాట్లాడకుండా తీసుకున్నాడు కాగితాన్ని. రామబ్రహ్మం భార్య బజారుకు వెళ్ళి డాక్టరు రాసి ఇచ్చిన మందులు కొనుక్కొని భర్తను తీసుకొని తన ఊరు వెళ్ళిపోయింది.

** ** **

ఆఫీసరు ఆ రోజు మరీ కోపంలో ఉన్నాడు. స్టాఫునంతా పొలం దున్నినట్లు దున్నేశాడు. అందరూ భయపడి చస్తున్నారు. రాత్రి పది గంటల సమయం...ఇంతలో 'టెలిగ్రామ్' అంటూ వచ్చాడు మెసెంజరు.

ఆ టెలిగ్రామ్‌లో రామబ్రహ్మం అనే పేరు కనబడేసరికి ఉగ్రుడయిపోయాడు ఆఫీసరు. మామూలుగా ఉద్యోగస్థులు సెలవు ఇవ్వని చోట్ల ఒకటి, రెండు రోజులు సెలవు శాంక్షను చేయించుకొని పోయి తరువాత తమకు కావలసినన్ని రోజుల సెలవుకు టెలిగ్రామ్ కొడుతుంటారు.

కోపంతో మండిపోయిన ఆఫీసరు "నాలుగు రోజులని సెలవు పెట్టి పోయి సెలవు ఎక్‌స్టెండు చేయమని టెలిగ్రామ్ కొడతాడా? ఈయన బాబు ఎవరున్నా రిక్కడ సెలవు గ్రాంటు చేయడానికి?" అని రంకెలువేస్తూ టెలిగ్రామ్ మీద "కాల్ ఫార్ హిజ్ ఎక్స్‌ప్లనేషన్" అని రాశాడు. అంటే రామబ్రహ్మం సంజాయిషీ కోరుతున్నాడన్న మాట ఆఫీసరు.

పోతూ పోతూ అటెండర్ని పిలిచి, ఆ టెలిగ్రామ్ మేనేజరు కివ్వమని చెప్పి, తను జీపులో వెళ్ళిపోయాడు. టెలిగ్రామ్ మేనేజరుకు అందింది. టెలిగ్రామ్ చదివిన మేనేజరుకు దుఃఖం పొంగుకొచ్చింది. టెలిగ్రామ్‌మీద ఆఫీసరు ఎర్ర సిరాతో వ్రాసింది చదివాక కోపంతో వణికిపోయాడు.

"నరరూప రాక్షసుడు, రావణాసురుడు, కంసుడు, కీచకుడు, బకాసురుల తెగకు చెందినవాడు. ఆ రాక్షసులు పోయిన తరువాత మరో రాక్షసుడు పుట్టాడు" అంటూ పెద్దగా తిట్టాడు.

ఆఫీసరు వెళ్ళిన తరువాత తమ సీట్లకు నమస్కారం పెట్టి చెప్పిపోవడానికి వచ్చిన ఆఫీసు స్టాఫుకు తన చేతిలోని టెలిగ్రామ్ చూపించాడు. అందరి ముఖాలూ వెలవెలా పోయాయి. అందరి కళ్ళూ గండి తెగిన చెరువు లయ్యాయి. కన్నీరు అదేపనిగా కారసాగింది. అందరూ వాసుదేవరావుని ఒక ఆఫీసరుగా మరిచిపోయి ఇష్టం వచ్చినట్టు తిట్టసాగారు. టెలిగ్రామ్‌లో అందరికీ రామబ్రహ్మం ముఖమే కనిపిస్తోంది. 'జాలి లేదా నా మీద!' అన్నట్లు దీనంగా కనబడ్డాయి అతని చూపులు.


కారణం-టెలిగ్రామ్‌లోని విషయం.

"రామబ్రహ్మం ఎక్స్‌పైర్డ్ టు డే ఎట్ టెన్ ఏ ఎమ్..." కింద అతని భార్య పేరు ఉంది.

అంటే, "రామబ్రహ్మం ఈ రోజు ఉదయం పది గంటలకు చనిపోయాడు" అని దాని అర్థం.

గవర్నమెంటు ఉద్యోగస్థులు చనిపోతే వెంటనే తెలియజేయాలి గనుక అతని తరపున అతని భార్య పంపిన వర్తమాన మది.

టెలిగ్రామ్‌లో రామబ్రహ్మం పేరు చూసిన ఆఫీసరు రామబ్రహ్మం సెలవు పొడిగిస్తున్నట్లుగా అర్థం చేసుకొని, "కాల్ ఫార్ హిజ్ ఎక్స్‌ప్లనేషన్"






అని ఎర్ర సిరాతో పెద్ద అక్షరాలలో రాశాడు.

అంటే "అతని సంజాయిషీ కోరండి" అని.

అమలు చేయమని టెలిగ్రామ్‌ను మేనేజరుకు పంపాడు ఆఫీసరు.

అంటే మేనేజరు చనిపోయిన రామబ్రహ్మాన్ని సంజాయిషీ కోరాలన్న మాట. రామబ్రహ్మాన్ని పరోక్షంగా చంపింది ఆఫీసరే! అతని నిరంకుశత్వం వల్లనే రామబ్రహ్మం చనిపోయాడు.

నిరంకుశుడైన ఆఫీసరు ఒక టెలిగ్రామ్ వస్తే అదేమిటో చూసుకోకుండా దానిమీద ఇష్టప్రకారం రాస్తే ఏం కావాలి? వచ్చిన టెలిగ్రామ్ పూర్తిగా చదవవద్దా? దాంట్లో ఏముందో అర్థం చేసుకునే పన్లేదా? పేరు చూడగానే మనిషికి అంత అక్కసు రావాలా? అనేది అందరి ఆవేదన. ఆఫీసరంటే అందరికీ ఒక రకమైన ద్వేషం ఏర్పడిపోయింది. అందుకే అర్ధరాత్రి అత్యవసర సమావేశం ఏర్పాటయింది.

** ** **

మరునటి రోజు ఉదయం పదిన్నర కావస్తున్నా ఒక్కరూ ఆఫీసుకు రాలేదు. ఆఫీసు వాచ్‌మన్ తప్ప ఎవ్వరూ ఆఫీసులో లేరు. ఆఫీసరు ఒక్కడే తన సీట్లో కూర్చొని ఈ హఠాత్సంఘటనకు కారణం అర్థం కాక కారాలు మిరియాలు నూరుతూ, ఆహారం దొరికిందని సంబరపడిపోతున్నాడు. సరిగ్గా పదిన్నరకు వచ్చారు మేనేజరూ, స్టాఫు మెంబర్లూ.

తెరిచి ఉన్న ఆఫీసరు గది దాటి పోతూ అతణ్ణి చూస్తూ కూడా విష్ చేయకుండా ఎవరికి వారే వెళ్ళి వాళ్ళ సీట్లలో కూర్చున్నారు. మేనేజరు కూడా ఎప్పట్లా రాగానే ఆఫీసరు దగ్గరకు వెళ్ళి అర్జంటు విషయాలు మాట్లాడలేదు.

ఆఫీసరుకు చాలా అవమానంగా ఉంది. సింహాసనం మీదనుంచి కిందికి తోసివేయబడ్డట్టు ఫీలవుతున్నాడు.

బెల్లు కొట్టాడు. ఎదురుగా వచ్చి నిలబడ్డాడు ప్యూను.

"వెళ్ళి 'క' గుమాస్తాను పిలువు."

'క' గుమాస్తా రాలేదు.

"ఎక్కడ 'క' గుమాస్తా?"

"పిలిచాను."

"ఎందుకు రాలేదు?"

"నాకేం తెలుసు? మీరే వెళ్ళి కనుక్కోండి." అటెండరు పెడసరపు సమాధానం.

ఇలాగే గుమాస్తాలను పేరు పేరునా పిలిచాడు. ఎవరూ రాలేదు. ఎవరి పని వాళ్ళు చేసుకుపోతున్నారు. ఆఫీసరు తల పగిలిపోతూ ఉంది. ఏమీ అర్థం కావడం లేదు. సాయంత్రం నాలుగు గంటలప్పుడు ఆఫీసరు తనే లేచి మేనేజరు రూములోకి వెళ్ళాడు. మేనేజరు ఇతణ్ణి పలకరించలేదు. సీట్లోంచి లేవలేదు. కొద్ది సేపు నిలబడి తన గదిలోకి వెళ్ళిపోయాడు ఆఫీసరు.

మౌనంగా తన మీద ప్రతీకారం తీర్చుకొంటున్న స్టాఫు-తన నిరంకుశత్వాన్ని ఇప్పటివరకు సహించిన స్టాఫు ప్రస్తుతం తనని గడ్డిపోచగా కూడా భావించడం లేదు. తన ఉనికినే మరిచిపోయినట్లు వ్యవహరిస్తున్నారు.

సాయంత్రం అయిదయింది. ప్యూను పుల్లయ్య టిఫిను కారియరు సంచిలో పెట్టుకొని ఆఫీసరు ముందే ఇంటికి బయలుదేరాడు. మేనేజరు, గుమాస్తాలు, అటెండర్లు నవ్వుకొంటూ, తుళ్ళుకొంటూ, కబుర్లాడుకొంటూ ఇంటికి వెళ్ళిపోయారు. అయిదూ పదికల్లా ఆఫీసు నిర్మానుష్యమైపోయింది. వాచ్‌మన్ ఎక్కడో బయట గేటు దగ్గర కూర్చుని ఉన్నాడు. ఒక్కడుగా ఉన్న ఆఫీసరుకు భయం భయంగా ఉంది. 'చలిచీమల చేత జిక్కి' అన్నట్లుంది అతని పరిస్థితి.

అప్పుడొచ్చిందొక టెలిగ్రామ్ హైదరాబాద్ హెడ్ ఆఫీసునుంచి.

అందులో రామబ్రహ్మం మరణానికి పరోక్షంగా కారకుడైన ఆఫీసర్ని విచారణ పూర్తయ్యేవరకూ సస్పెండు చేస్తున్నట్టూ, వెంటనే అతను ఛార్జీ మేనేజరుకు ఇచ్చి వెళ్ళమన్నట్టూ ఉంది.

అప్పుడు గుర్తొచ్చి రామబ్రహ్మం టెలిగ్రామ్‌కోసం వెదికాడు. ఎక్కడా కనిపించలేదు. అతనికేం తెలుసు ఆ టెలిగ్రామ్ ఒరిజినలు ఛీఫ్ మినిస్టరుకు పోయిందని, దాని జిరాక్సు కాపీలు హెడ్డాఫీసుకు, సంబంధిత పెద్ద ఆఫీసులకు వెళ్ళాయని?

*

# ప్రముఖుల హాస్యాలు

## పి. స్వరాజ్యలక్ష్మి

**యునైటెడ్** స్టేట్స్ ఆఫ్ అమెరికా 16వ ప్రెసిడెంటు అబ్రహాం లింకన్ జీవితం సువర్ణాక్షరాలతో లిఖించదగ్గది. ఆయనలోని పవిత్రాశయాలు, మానవత, బుద్ధి వికాసాలతోపాటు చమత్కారంలోని ఏ కొన్ని భాగాలను పరిశీలించినా ఆయన అసమాన తెలివితేటలు బోధపడగలవు.

** ** **

లింకన్ చదువుకొనే రోజుల్లో ఒకనాడు ఉపాధ్యాయునికి కోపం వచ్చి "లింకన్! నీకు తిండి ఒంటబట్టినట్టు చదువు ఒంటబట్టటం లేదు-ఎందుకనీ?" అన్నాడు.

దానికి లింకన్ నవ్వుతూ శాంతంగా ఇచ్చిన జవాబిది-"తిండేమో అమ్మ తినిపిస్తుంది- చదువేమో మీరు చెబుతున్నారు."

** ** **

ఒకనాడు లింకన్ పట్టణానికి బయలుదేరాడు. ఒకాయన బండి తోలుకు పోతుండగా లింకన్ ఆయన్ను ఆపి "అయ్యా! నా ఈ కోటును కాస్త పట్టణానికి చేరుస్తారా?" అని అడిగాడు.

"తప్పకుండా. అయితే, దానిని అక్కడ మీరెలా తీసుకోగలుగుతారు?" అని అడిగాడా పెద్దమనిషి.

"ఏం ఫర్వాలేదు- నేను ఆ కోటులోనే దాక్కొని ఉండటానికి నిర్ణయించుకున్నాను" అన్నాడు లింకన్.

** ** **

లింకన్ పొడగరి. ఆయన భార్య పొట్టి. వారికి మొదటి శిశువు జన్మించినప్పుడు లింకన్ ఇలా అన్నాడు-"నేను ఎంతో భయపడ్డాను. కానీ, ఇప్పుడీ శిశువును చూశాక ఆ భయం పోయింది."

"దేన్ని గురించి ఎందుకు భయపడ్డావు?" అన్నాడు అతని మిత్రుడు.

"శిశువుకు తల్లితండ్రుల పోలికలే వస్తాయంటారు కదా. నా బిడ్డకు ఒకటి నా కాలూ, రెండోది నా భార్య కాలూ వస్తాయేమో అని భయపడ్డానుసుమా" అన్నాడు లింకన్ (లింకన్ ఎత్తు 6'4").

XX XX XX

న్యూయార్క్ లాయరు ఒకాయన తాను సుప్రీమ్ కోర్టు జడ్జి కావాలనే మహదాశయంతో ప్రెసిడెంట్ లింకన్‌ను దర్శించాడు.

"ఇప్పుడు 10 మంది జడ్జీలు మాత్రమే ఉన్నారు. వారికి పని భారమై పోతోంది. నన్నుకూడా జడ్జిగా వేస్తే..." అన్నాడా లాయర్.

"అంటే జడ్జీల సంఖ్య వంద చేయమంటారా?" సాలోచనగా అడిగాడు లింకన్.

"వందా? వందేమిటి?"

"ఉన్న పది మందికి మరో సున్న కలిపితే అంతేగా మరి?" అన్నాడు లింకన్ శాంతంగా.

** ** **

"బ్రిటిష్ సామ్రాజ్యంలో సూర్యుడు అస్తమించడు-తెలుసా?" అన్నారొకరు ప్రెసిడెంట్ లింకన్‌తో.

"ఔను. సూర్యుడు కూడా బ్రిటిష్ వాళ్ళను నమ్మడు. తాను అస్తమిస్తే ఆ చీకట్లో ఇంకెన్ని భయానక కార్యాలను బ్రిటిష్ వారు చేస్తారో అని భయపడి సూర్యుడు వారి సామ్రాజ్యంలో అస్తమించకుండా ఉండేందుకే నిర్ణయించుకొన్నాడు!" అన్నాడు లింకన్.

** ** **

లింకన్ తన బూట్లకు రంగు వేసుకుంటుండగా ఆయన మిత్రుడొకడు వచ్చి "లింకన్! పెద్దమనుషులు తమ బూట్లకు తామే రంగు వేసుకోరు" అన్నాడు ఆయన పదవిని గుర్తు చేస్తూ.

దానికి లింకన్ అన్నాడు-"అయితే, ఆ పెద్దమనుషులు ఎవరి బూట్లకు రంగు వేస్తుంటారు?"

** ** **

లింకన్ ఒకనాడు జైళ్ళు చూసేందుకు వెళ్ళాడు. జైళ్ళలో ఉన్న వారితో మాట్లాడే సందర్భంలో అందరూ తమకు ఆ శిక్ష ఎంతో అన్యాయంగా పడిందనే చెప్పసాగారు.

ఒకడుమాత్రం "ప్రెసిడెంట్! నేను నేరం చేశాను. నేరానికి తగిన శిక్షను అనుభవించి ప్రాయశ్చిత్తాన్ని పొందుతున్నానని విశ్వసిస్తున్నాను" అన్నాడు.

ప్రెసిడెంట్ లింకన్ అన్నాడు-"నీవు నేరస్థుడివి, దుర్మార్గుడివి. ఇక్కడ ఉన్నవారంతా సన్మార్గులు. అలాంటి సన్మార్గుల మధ్య నీవంటి దుర్మార్గుడు ఉన్నట్టయితే వారూ చెడిపోతారు. కనుక నిన్ను వెంటనే ఇక్కడి నుంచి పంపించివెయాలి" అని ఆ ఖైదీని వెంటనే విడుదల చేయించాడు.

ఇటువంటివి లింకన్ జీవితంలో కోకొల్లలు.